క్లుప్తంగా

పారిశ్రామిక కారిడార్లతోనే ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న మంద పవన్

హుస్నాబాద్: జిల్లాలో పారిశ్రామిక కారిడార్లను ఏర్పాటు చేస్తేనే యువతకు ఉపాధి అవకాశాలు సాధ్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శిగా ఆయన మరోసారి ఎన్నికయ్యారు. హుస్నాబాద్‌లోని అనబేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మహాసభకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. జిల్లా సహాయ కార్యదర్శిగా గడిపే మల్లేశ్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపికచేసినట్టు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న గౌరవెల్లి, గండిపెల్లి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాలను చేర్యాల రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు.

కళాకారులకు గుర్తింపేది?



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర సాధనలో ఉద్యమించిన కళాకారులు అన్ని రకాలుగా నష్టపోయారని, తమను గుర్తించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ జిల్లా నాయకులు నందిని మాస్టర్, అస్క స్వామి కోరారు. గురువారం మిరుదొడ్డిలో వారు విలేకరులతో మాట్లాడారు. ఉద్యమంలో పాలు పంచుకున్న కళాకారులు ఆదరణ లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లా కేంద్రంలోను అమర వీరుల స్మృతి భవనాలను నిర్మించాలని కోరారు. ఉద్యమ కళాకారుల జేఏసీ నాయకులు ధర్మారం రాజు, శివకృష్ణ, ప్రశాంత్, మల్లేశం పాల్గొన్నారు.

కష్టపడి చదివితే గుర్తింపు



విద్యార్థులతో ఎంఈఓ తదితరులు

దుబ్బాకరూరల్: విద్యార్థులు కష్టపడి చదివితేనే సమాజంలో గుర్తింపు వస్తుందని ఎంఈఓ అంజయ్య అన్నారు. మండలంలోని రామేశ్వరంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'అసోసియేషన్ ఆఫ్ అలియన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ సిద్దిపేట' ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, గ్రామానికి చెందిన పల్లె అనిల్ టై, బెల్ట్‌లు పంపిణీ చేశారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన వాటిని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సెల్ ఫోన్లు, గేమ్‌లు ఆడడం వల్ల దృష్టి లోపం వస్తుందన్నారు. హెచ్‌ఎంలు నీలం శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, అలయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈశ్వర్ చరణ్, రాములు, అంతయ్య, సత్యనారాయణ, ధనుంజయ్ పాల్గొన్నారు.

మొక్కలతోనే మనుగడ



మొక్క నాటుతున్న బుచ్చయ్య

చిన్నకోడూరు(సిద్దిపేట): మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని ఫారెస్టు సెక్షన్ అధికారి బుచ్చయ్య సూచించారు. మండల పరిధిలోని కమ్మర్లపల్లిలో అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో బీట్ అధికారులు సుమన, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పెంచాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డు ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలను మరింతగా పెంచాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ కోరారు. గురువారం జగదేవ్‌పూర్‌లో నిర్వహించిన ఆ సంఘం ప్రథమ మహాసభలో ఆయన మాట్లాడారు. యాభై యేళ్లు నిండిన కార్మికులకు రూ.9 వేలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన మండల కమిటీని ఎంపిక చేశారు. నాయకులు బాల్‌లింగం, భాస్కర్, సూరి, స్వామి, యాదగిరి, శివ, తిరుపతి, సీఐటీయూ నేత కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వానాకాలం.. జర పైలం

వానాకాలం ప్రాంభమవ్వడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం ఆసన్నమైంది. ఈ కాలంలో కలుషిత నీరు, ఆహారం తీసుకోవడంతోపాటు పరిసరాల పరిశుభ్రత లేకపోవడంతో జ్వరం, జలుబు, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర రోగాల బారిన పడుతుంటాం. ఈ కాలంలో కొన్ని జాగ్రత్తలు తప్పని సరిగా పాటించాల్సి ఉంటుంది.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

- పారిశుధ్య లోపంతో జ్వరాలు
- పొంచి ఉన్న డెంగీ, మలేరియా ముప్పు
- జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన



ఇబ్రహీంనగర్‌లో ఇళ్ల సమీపంలో నిలిచిన నీరు

చిన్నకోడూరు(సిద్దిపేట): వర్షాల వల్ల గ్రామాలలో నీరు నిలిచి పోతుంది. దీంతో చాలా ఇబ్బందులు ఎదుర్కోవలిసి వస్తుంది. మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండడం ద్వారా చాలా వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. వర్షాలకు నీరు చేరడం, పరిసరాలలో నీటి నిల్వలు పెరగడం వల్ల వివిధ రకాల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ముఖ్యంగా తాగునీటి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షం నీరు నిలిచిన ప్రాంతాలు దోమలకు ఆవాసాలుగా మారతాయి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని వైద్యులు చెప్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. భోజనానికి ముందు, మల, మూత్ర విసర్జన తరువాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలి
- కాచి చల్లార్చిన నీటిని, తాజా ఆహారపదార్థాలను మాత్రమే తీసుకోవాలి
- బయట ఆహార పదార్థాల జోలికి వెళ్లొద్దు. పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడిగి వాడాలి
- ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. ప్రతివారం ఒకరోజు డ్రై డే పాటించాలి
- చిన్నారులు, వృద్ధులు తమ శరీరం పూర్తిగా కప్పుకొనేలా దుస్తులు ధరించాలి
- ఇళ్ల చుట్టూ ఖాళీ ప్రదేశాల్లో వర్షపు నీరు నిలిచే చోట ఆయిల్ బాల్స్ వేయాలి
- అనారోగ్యానికి గురైతే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్యులను కలవాలి

పరిశుభ్రత చాలా కీలకం



వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మన శరీర ఉష్ణోగ్రత 100 డిగ్రీలు దాటితే జ్వరంగా ఉన్నట్లు గుర్తించాలి. అనారోగ్యంగా ఉన్నట్లు కనిపిస్తే ఆస్పత్రికి వెళ్లాలి. వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇస్తాం. ప్రతి ఫ్రైడేను డ్రై డేగా చేసుకోవాలి. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి.

– డా.ఐశ్వర్య, పీహెచ్‌సీ వైద్యురాలు, చిన్నకోడూరు

నానో యూరియా లాభదాయకం

డివిజన్ వ్యవసాయాధికారి బాబూనాయక్



నానో యూరియాను అందజేస్తున్న బాబూనాయక్

కొండపాక(గజ్వేల్): వ్యవసాయంలో నానో యూరియా వాడకం ఎంతో లాభదాయమని గజ్వేల్ డివిజన్ వ్యవసాయాధికారి(ఏడీఏ) బాబూనాయక్ చెప్పారు. మండలంలోని మేదినీపూర్‌లోని రైతువేదిక భవనంలో గురువారం నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, ఇతర కూరగాయల పంటల సాగులో రైతులు వాడుతున్న సంప్రదాయ యూరియాతో భూ సారం తగ్గిపోతుందన్నారు. అలాగే పెట్టుబడులు కూడా పెరిగి దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ సారం కోల్పోకుండా చూసేందుకు ప్రభుత్వం శాస్త్రవేత్తలతో పరిశోధనలు చేయించి నానో యూరియా స్ప్రే వాడకాన్ని తీసుకువచ్చారని వివరించారు. నానో యూరియాను స్ప్రే చేసుకోవడం వల్ల పోషకాలు నేరుగా మొక్కలకు చేరడంతో తొందరగా ఎదుగుదలకు దోహదపడుతుందని చెప్పారు. నానో యూరియా వాడకానికి అలవాటు పడేందుకు గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఇఫ్కో సంస్థ జిల్లా మేనేజర్ చంద్రబాబు నాయుడు, మండల వ్యవసాయాధికారి గోవిందరాజు, ఏఈఓలు రమ్యశ్రీ, శ్రీహరి, రైతులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటుదాం



చేర్యాల(సిద్దిపేట): కార్యకర్తలతో బాల్‌నర్సయ్య తదితరులు

బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత బాల్‌నర్సయ్య

చేర్యాల(సిద్దిపేట): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చాటాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య పిలుపునిచ్చారు. మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న పార్టీ సన్నాహక సమావేశాల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని వేచరేణి, కమలాయపల్లి, అర్జునపట్ల గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, జిల్లా నాయకుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్ధంగా ఉండాలి

సిద్దిపేటజోన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుదామని బీఆర్‌ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేణుగోపాల్, మాజీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డి మాట్లాడారు. 19 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ప్రజలను చైతన్యం చేయాలని కార్యకర్తలకు సూచించారు. నాయకులు బాలరంగం, ఎల్లం, శ్రీనివాస్ జనార్దన్, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'రెవెన్యూ డివిజన్' కోసం 25న బంద్

జేఏసీ చైర్మన్ డాక్టర్ పరమేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్వర్

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ 25న జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన చేర్యాల బంద్‌ను విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ పిలుపు నిచ్చారు. స్థానిక జేఏసీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. సుమారు తొమ్మిదేళ్లుగా జేఏసీగా ఏర్పడి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినా ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక తీరలేదని వాపోయారు. అప్పుడు జనగామలో జరిగిన ఓ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కూడా వినతిపత్రాలు ఇచ్చామని, అయినా రాష్ట్ర ప్రభుత్వంవైపు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరం అన్నారు. అందుకే 25న చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాల బంద్ నిర్వహించనున్నట్టు చెప్పారు. వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. విద్యాసంస్థలకు మినహాయింపు ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జేఏసీ నాయకులు అశోక్, బీరయ్య, రాజు, వెంకటాద్రి, చంద్రం, సాయిలు, భూమయ్య, నరేశ్, యదగిరి, భద్రయ్య, లింగం, కుమార్, ఆంజనేయులు, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిషాసుర మర్ధిని జాతర



బెజుగామలో కొలువుదీరిన అమ్మవారు

గజ్వేల్‌రూరల్: మహిషాసుర మర్ధిని అమ్మవారి జాతర ఏర్పాట్లను గ్రామస్తులు ఘనంగా చేపట్టారు. దేశంలోనే రెండో దేవాలయంగా ప్రసిద్ధిగాంచిన అమ్మవారు భక్తుల పాలిట కల్పవల్లి విరాజిల్లుతోంది. మొదటి దేవాలయం కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో ఉండగా, రెండో దేవాలయం గజ్వేల్ మండలం బెజుగామలోనే ఉంది. పురాతనమైన ఈ దేవాలయాన్ని పునర్నిర్మించేందుకు గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి పనులను చురుకుగా సాగుతున్నాయి. ప్రతియేటా సికింద్రాబాద్‌లోని మహంకాళీ అమ్మవారి బోనాల ఉత్సవాలు జరిగిన తర్వాత బెజుగామలో మహిషాసుర మర్ధిని అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. 18న జాతర నిర్వహించేందుకు గ్రామస్తులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని చార్యలు చేపట్టారు.

త్వరగా పూర్తి చేయండి

మద్దూరు(హుస్నాబాద్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి రాధిక సూచించారు. మండల పరిధిలోని రేబర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం ఆమె పరిశీలించారు. ఎంపీడీఓ రామ్మోహన్, ఏఓ రామకృష్ణ, హౌసింగ్ ఏఈ చిన్ను సహాని తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సహాయం

దుబ్బాకరూరల్: ఓ బాధిత కుటుంబానికి కానిస్టేబుల్ నిత్యావసరాలు అందించి అండగా నిలిచారు. వరంగల్ జిల్లాకు చెందిన ఓ పేద కుటుంబం బతుకు తెరువు కోసం వచ్చి ఆరేళ్లుగా చిట్టాపూర్‌లో నివాసం ఉంటున్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. బాధితురాలి భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో పస్తులు ఉండవాల్సిన పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న భూంపల్లి పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ యాదగిరి గురువారం ఆమెకు నెలకు సరిపడా నిత్యవసర వస్తువులు అందజేశారు.

టై, బెల్టులు అందజేత

వర్గల్(గజ్వేల్): మండలంలోని తున్కిఖాల్సా పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి రూ.47వేలు విలువైన టై, బెల్ట్, బ్యాడ్జీలు అందజేశారు. పాఠశాలలో చదివి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడిన చందా పురుషోత్తం తన వంతు సాయం అందిచాలని భావించి గురువారం హెచ్‌ఎం శ్యామ్‌రాథోడ్, పులిరాజు, మంజుల, శ్రీనివాస్, జరీనా, ఫరహాన సమక్షంలో విద్యార్థులందరికీ టై, బెల్ట్, బ్యాడ్జీలు అందజేశారు. ఆయనను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

గజ్వేల్‌రూరల్: పాలిటెక్నిక్‌లో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు గజ్వేల్ ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్(జీఎంఆర్) కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకట కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలుర ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలోగల జీఎంఆర్ పాలిటెక్నిక్‌లో డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్(డీఈసీఈ), డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్(డీఎంఈ), డిప్లొమా ఇన్ కంప్యూటర్ కమర్షియల్ ప్రాక్టీస్(డీసీసీపీ) బ్రాంచ్‌లలో స్పాట్ అడ్మిషన్ ద్వారా ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. డిప్లొమో చేయాలని ఆసక్తి కలిగి ప్రవేశపరీక్ష రాసి అడ్మిషన్ పొందని వారు, ఎంట్రెన్స్ పరీక్షలు లేకుండా డైరెక్ట్‌గా చేరాలనుకునే విద్యార్థులకు ఇది చక్కని అవకాశమని, ఆసక్తిగల విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు పత్రాలను అందజేయాలని సూచించారు. ఆగస్టు 5న ఎంపికైన వారి జాబితాను ప్రకటిస్తామని, మరిన్ని వివరాలకు స్వామి(99513 76362), సత్యనారాయణ(96768 41339)లను సంప్రదించాలని కోరారు.

ఆలయాల అభివృద్ధే లక్ష్యం

నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి



కాశీవిశ్వనాథుడిని దర్శించుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి నాయకులు

దుబ్బాకటౌన్: పట్టణంలో కాశీవిశ్వనాథ ఆలయం, పోచమ్మ తల్లి ఆలయ పుణర్నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. గురువారం ఆయన ఆ ఆలయాలను సందర్శించారు. అనంతరం మల్లాయపల్లి వార్డులోని ప్రాథమిక పాఠశాలలో వన మహోత్సవంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. పాఠశాలను తిరిగి ప్రారంభించడానికి కృషి చేసిన యువకుడు స్వామి, గ్రామస్తులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను సంరక్షించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొంగరి రవి, సాయితేజ, నరేశ్, సురేశ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

'ఆయిల్‌పామ్'తో అధిక లాభాలు

ఆయిల్‌పామ్ తోటలు సాగుచేస్తే రైతులు అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ అధికారులు పిలుపునిచ్చారు. మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పంటతో వచ్చే లాభాలు, సబ్సిడీల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపి ఆర్థికంగా ఎదగాలని సూచించారు.



గజ్వేల్: క్యాసారంలో మొక్కకు నీరుపోస్తున్న మల్లారెడ్డి, బాబునాయక్ తదితరులు



కొండపాక(గజ్వేల్): మొక్క నాటుతున్న ఏఓ శివరామకృష్ణ, అధికారులు



చిన్నకోడూరులో ఆయిల్‌పామ్ మొక్క నాటిన ఏడీఏ పద్మ, అధికారులు, నాయకులు



ములుగు(గజ్వేల్): రైతులతో కలసి మొక్క నాటుతున్న అధికారులు



మిరుదొడ్డి(దుబ్బాక): మొక్క నాటుతున్న అధికారులు మల్లేశం, రమేశ్



జగదేవ్‌పూర్(గజ్వేల్): తిమ్మాపూర్‌లో...



చేర్యాల(సిద్దిపేట): మొక్క నాటిన అధికారులు



మద్దూరు(హుస్నాబాద్): మొక్కనాటిన అధికారులు రాధిక, రామకృష్ణ, కౌసల్య తదితరులు

సాగునీరు అందించకపోతే కలెక్టరేట్ ముట్టడి

మల్లన్న సాగర్ నుంచి సాగునీరు విడుదల చేయాలి



తొగుటలో సమావేశమైన బీఆర్‌ఎస్ నాయకులు

తొగుట(దుబ్బాక): వారం రోజుల్లోగా సాగునీరు విడుదల చేయకుంటే రైతులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లారెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలో గురువారం బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి మాట్లాడారు. మల్లన్న సాగర్ నుంచి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పత్తి, మొక్కజొన్న, వరి పంటలు ఎండిపోతున్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా పాతకాలువల్లో పూడిక తీయలేదని ఆరోపించారు. పంటలు ఎండిపోతున్నా నీటిని విడుదల చేయకపోవడంతో వరినాట్లు వేయలేని పరిస్థితి నెలకొందని, వెంటనే స్పందించి నీటిని విడుదలచేసి చెరువులు నింపాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అరుణ్‌కుమార్, నరేందర్, రాజిరెడ్డి, యాదగిరి, రమేశ్, శ్రీనివాస్, అనిల్, కరుణాకర్, నర్సింహులు పాల్గొన్నారు.

విశ్వకర్మలకు ఉచిత విద్యుత్ అందించాలి

జాతీయ నేత పున్నమాచార్యులు



మాట్లాడుతున్న పున్నమాచార్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విశ్వకర్మల కుటీర పరిశ్రమల కోసం ఉచిత విద్యుత్ అందించాలని భారతీయ విశ్వకర్మ పరిషత్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పున్నమాచార్యులు కోరారు. స్థానిక విశ్వకర్మ ఆలయ ప్రాంగణంలో గురువారం రాష్ట్ర స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సబ్సిడీని పెంచిడంపై రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. విశ్వకర్మ వృత్తిదారులపై ఫారెస్ట్ అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని, వాటికి అడ్డుకట్ట వేయాలని కోరారు. త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన విశ్వకర్మల శంఖారావం కార్యక్రమంలో విశ్వకర్మలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు బాసంపల్లి నరసింహాచారిని రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వేణుగోపాలాచారి, యాదగిరి, నాగరాజు బాలయ్య, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.